# 16. ( సాంస్కృ ) తిక్క విలేకరి

సాధారణంగా ఆఫీసుల్లో పనిచేసే వాళ్లకి ఏదైనా ప్రమోషన్ వస్తే సహాధ్యాయులకి గుట్టుగా ఓ పూట చిన్న టీ పార్టీ ఇవ్వడం ఆచారం. కానీ నా విషయంలో అలాగ జరగలేదు. నేను అసిస్టెంటు మేనేజరుగా ప్రమోషన్ పొందడం, ఆ పోస్టులో ఉన్న సుధాకరరావుగారికి డెప్యూటీ మేనేజరుగా ప్రమోషన్ వచ్చి మా కంపెనీలోనే ఇంకో డివిజన్‌కి మారడం, ఆయన రిలీవ్ చెయ్యవలసిన సుబ్బారావు గారు రిటైరయిపోవడం ఇలా "చెయిన్ రియాక్షన్" అంటారే; ఆ పద్ధతిని వచ్చింది ఆ ఆర్డర్. నేనున్న అప్పర్ డివిజన్ గుమస్తా ఉద్యోగానికి గుంటూరు నుంచి భావనారాయణ వచ్చి సిద్ధంగా వున్నాడు.

ఇంతమందికి ఒకేసారి మంచి జరగడం వల్ల మా ఆఫీసులో కొందరు ఉత్సాహవంతులు దీన్ని ఒక మరువరాని సంఘటనగా భావించి ఒక మీటింగు పెట్టి; రిటైరైన సుబ్బారావు గారికి వీడ్కోలు, సుధాకరరావు గారికీ నాకూ భావనారాయణకీ సన్మానం ఇవన్నీ ఆ మీటింగులో చేద్దాం అన్నారు. కొంత డబ్బు (ఉద్యోగులే) చందాలుగా ఎత్తి సిద్ధం చేశారు. చాలదనిపించిన కాడికి మా ఆఫీసుతో సంబంధం వున్న కాంట్రాక్టర్ల నుంచి విరాళాలు పోగుచేసి మీటింగు భారీ ఎత్తున జరపడానికి ఏర్పాట్లు చేసేరు. ముఖ్య అతిథిగా "విచ్చేయడానికి" మా మేనేజింగు డైరెక్టరు గారు "దయతో అంగీకరించిరి."

ఆ మీటింగులో "ఎజెండా" అనబడే "కార్యక్రమ-క్రమం"లో "పరిచయం" అని వొక ఐటం పెట్టేరు. పరిచయవాక్యాలు చెప్పడానికి నిర్ణీతుడయిన ప్రకాశశర్మకి నా 'బయోడేటా' చూసి మతిపోయి ఏం మాట్లాడాలో తెలీక "నాస్పీచి మీరే రాసిచ్చేయండి గురూగారూ" అన్నాడు.

మన కంపెనీలో అప్పర్ డివిజన్ గుమాస్తాగా ఉంటూ అసిస్టెంట్ మేనేజర్‌గా ప్రమోషన్ సాధించిన రాఘవగారు కేవలం ఒక బ్యూరోక్రాట్‌గా కొట్టి పారేడానికి వీల్లేని బహుముఖ ప్రజ్ఞావంతులు. వారు చిన్న వయసులో బి.కామ్. పాసయి ఉండడమూ, డిపార్టుమెంట్ పెట్టే పరీక్షలన్నింటిలో మొదటి ఛాన్సుల్లోనే ఉత్తీర్ణులు కావడమూ, అకౌంట్స్ డిప్లొమా పొందడమూ. మేనేజిమెంట్ కోర్సులో డిప్లొమా సాధించడమూ, పని పట్ల శ్రద్ధ, అధికారుల యెడల వినయ వినయ విధేయతలూ కలిగివుండడమూ, వీటి గురించి కాదు నేను చెప్తూంట. రాఘవ గారు రచయిత, గాయకుడు, చిత్రకారుడు, నటుడు కూడానన్న సంగతి మీలో చాలామందికి తెలియకపోవచ్చు. 1982లో రాఘవ గారికి "సకల కళా కోవిదుడు" అనే బిరుదు ప్రదానం జరిగింది. రాఘవ అనేది ఆయన అసలు పేరు కాదు. అది ఆయన పెన్ నేమ్- అనగా కలం పేరు; అది ఆయన కంఠనామం అనగా సింగర్ నేమ్. అలాగే చిత్ర నామం మరియు స్టేజినేమ్ - ఆయన అసలు పేరు "రావూరి ఘటోత్కచ వర్మ" అని నేను మీకు మనవి జేస్తూ యున్నాను. మనం అందరు ఆర్.జి. వర్మ అనిపిలుస్తున్న "రాఘవ" అనే ఈ రచయిత, గాయకుడు, చిత్రకారుడు, నటుడు యొక్క అసలు పేరు రావూరి ఘటోత్కచ వర్మ."

ఈ మాటలు విని, సభకి ముఖ్య అతిధిగా విచ్చేసిన మా మేనేజింగ్ డైరెక్టరు గారు; నా ప్రమోషన్ సందర్భంగా ఎవరో వెయ్యబోతున్న పువ్వుల దండ తనే అందుకుని స్వయంగా నా మెళ్లో వేసి నాతో ఫొటో దిగేరు. ఆ మర్నాడు ఆయన నన్ను తన ఛేంబర్సుకి పిలిపించి "నీ కొక కొత్త అసైన్‌మెంట్ ఇస్తున్నాను. మన కంపెనీలో నెలకొక నాటకం, సంగీత కచేరీ, డాన్స్ ప్రోగ్రాం జరుగుతున్నాయి. శివరాత్రికి, కృష్ణాష్టమికి, దీపావళికి చిత్రకళా ప్రదర్శనలు జరుగుతున్నాయి. వీటన్నిటికీ పత్రికా విలేకరుల్ని మనం పిలుస్తున్నాం గానీ వాళ్లు ఒకసారి వస్తారు ఒకసారి రారు. ఒచ్చినవాడు మనం ఇచ్చే గోల్డుస్పాట్లు తాగి, బిస్కెట్లు తిని వెళ్తాడే తప్ప మన ప్రోగ్రాంలని హైలెట్ చేస్తూరాయడు. రాసినవాడు ఫొటోలు వెయ్యడు. ఇదంతా నేను మన వూరి దినపత్రిక మేనేజర్‌గా పనిచేస్తున్న మా షడ్డకుడు ముత్యాలరావుతో డిస్కస్ చేసేను. ఎప్పుడు ఏ ప్రోగ్రాం జరిగినా నువ్వు అదంతా కవర్ చేస్తూ సమగ్రమైన రిపోర్టు తయారుచేసి, ఫొటోలు సేకరించి పట్టుకెళ్లి ఆయనకిస్తే అవన్నీ ఆ పేపర్లో వచ్చే విధంగా వాళ్ల సంపాదక విభాగానికి చెప్తేడు. అంచేత ఆ పనిమీద ఉండు. నీకూ మన కంపెనీకీ కీర్తి వస్తుంది. కొంత అదనపు ఆదాయం కూడా నీకు వస్తుంది.'' అని చెప్పేరు.

దాంతో విజృంభించేను. నాకు "సకల కళా కోవిదుడు'' అనే బిరుదు ప్రదానం జరిగిన సభలో ఈవూరి రచయితల సంఘం అధ్యక్షుడు, ఈ వూరి చిత్రకారుల సంఘం అధ్యక్షుడు, నాటక కళాసంఘం అధ్యక్షుడు, కళాకారుల సంఘం అధ్యక్షుడు మాట్లాడి ఎవడిమట్టుకువాడు ఇతను మంచి గాయకుడూ చిత్రకారుడు అనీ, చిత్రకారుడూ రచయితా అనీ, రచయితా నటుడు అని చెప్పేసి అన్యాపదేశంగా నేను రచయితను కాదని, గాయకుణ్ణి కాదని, చిత్రకారుణ్ణి కాదని, నటుణ్ణి కాదని తేల్చేసిన సంగతి నాకు గుర్తుంది. అందుకని అన్ని ఫంక్షన్‌లు కవర్ చేసి అన్ని కళా రంగాల్లో నా ప్రవేశం పత్రికాముఖంగా చాటి చెప్పుకున్నాను. ప్రతి సంఘటనలోను మా కంపెనీ అధికారులు పాల్గొనడం ముఖ్య అతిథులుగా మా ఎం.డి. గారు, పోలీసు సూపరింటు గారు, జిల్లా జడ్జిగారు, కలెక్టరు గారు మొదలైన వి.ఐ.పి.లు విచ్చేస్తే వారందరి ఉపన్యాసాలు నా రిపోర్టుల్లో రాసి వారందరి ఫొటోలు పేపర్లో వేసి వారియొక్కా, నా యొక్కా కళాతృష్ణను, కళాపోషణాభిరుచిని ప్రజలకి తెలియపరిచాను. బాగా పాప్యులర్ అయిపోయాను. నాకు నమస్కారాలు పెట్టేవాళ్లు రెట్టింపు మూడు రెట్లు, నాలుగు రెట్లు అయిపోయారు.

మొన్న డిసెంబర్‌లో మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరుగారు ట్రాన్స్‌ఫర్ అయిపోయి కొత్తాయన వచ్చేరు. రిలీవు అయిపోయిన పాత ఎం.డి. గారు వారంరోజుల జాయినింగ్ టైమూ ఇక్కడే ఉండిపోయినందువల్ల, మా కంపెనీ కళాకారులు ఇక ఉగాది, మేడే, స్వాతంత్ర్యదినం, దసరా, దీపావళి అనకుండా ఆ వారం అంతా "సాంస్కృతిక వారం'' అని గొప్ప ఉత్సవము చేసుకుని ప్రతిరోజు ఒక ముఖ్య అతిథిని చొప్పున ఆహ్వానించి "ధూంధాం'' గా నిర్వహించారు. (ధూంధాం అంటే 'పొగా, మంటా' అని సంస్కృతంలో అర్థం - కాని హిందీలో 'ఆర్భాటంగా' అని అర్థం) రోజూ ఎవడు రాస్తాడులే అని వారం అంతా జరిగిన ఉత్సవాల రిపోర్టు చివరి రోజున రాసి మర్నాటి పేపర్లో వేయించాను. పావు పేజి మేటరు, మరో పావు పేజి ఫొటోలు మొత్తం అరపేజీ జాగా నేనే ఆక్రమించాను, ఆ రోజు పేపర్లో.

ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకి ఎం.డి. గారి నుంచి కబురొచ్చింది. పేపర్లో చూసి ఉంటాడు. నా రిపోర్టు. ఫొటోలు అవీను.కానీ ఎందుకైనా మంచిదని ఒక కాపీ పట్టుకెళ్లాను.

నేనాయన రూమ్‌లోకి వెళ్లగానే నన్ను కూర్చోమన్నారు. గర్వంతో కూడిన చిరునవ్వు విసిరి కూర్చున్నాను. "ఈ రోజు పేపర్లో మన కంపెనీ గత వారం నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల రిపోర్టు చూశాను." అన్నారు ఆయన కూడా చిరునవ్వు నవ్వి .

"తమరు చూసినందుకు నాకు సంతోషంగా ఉంది" అన్నాను.

ఆయన సడన్‌గా సీరియస్ అయిపోయారు. "కాని నాకు సంతోషంగా లేదు!" అన్నారు.

నేను నిర్ఘాంతపోయాను. ఒళ్లో దాచిన నా కాపీ పేపరులోకి చూశాను. కొత్త ఎం.డి.గారు కళాకారుల్ని సన్మానిస్తున్న దృశ్యాలు మాంటేజి చేసి వేసింది బాగానే పడింది. శ్రీమతి ఎం.డి.గారు జ్యోతి వెలిగించడం కూడా ప్రముఖంగానే పడ్డాది.

"సాంస్కృతిక విలేకరి అంటే ఇలాగటయ్యా రాసేది? మేడమ్ ఎం.డి.గారు ఉత్సవాలు ప్రారంభిస్తూ జ్యోతి వెలిగించారా! ఎం.డి గారు కళాకారులకి మెమెంటోలు అందజేశారా! కలెక్టరు గారు కళాసేవ గురించి ఉపన్యాసం ఇచ్చేరా! పోలీసు ఎస్.పి గారు తను విద్యార్థిగా ఉండగా తను నటుడిగా ఎన్ని బహుమతులు పుచ్చుకున్నదీ వివరించేరా! జిల్లా జడ్జిగారు శాల్వడార్ డాలీ పికాసోల పెయింటింగ్స్ విశిష్టతని గురించి ఉపన్యసించేరా! రైల్వే ఎం.డి. గారు సంగీతం అనగానేమి-అది ఎన్ని విధములు-అని చర్చించారా! ఇదిటయ్యా నువ్వు సాంస్కృతికోత్సవాల గురించి రాసేది! ఏ నాటకంలో ఎవరు పాల్గొన్నారు, దాని రచయిత ఎవరు, దర్శకుడెవరు? ఏ సంగీత కచేరీలో ఎవరు పాడారు; సహకార గానం ఎవరు, సహవాద్యాలు ఎవరివి? రచయితల సమ్మేళనంలో ఎవరు పాల్గొన్నారు? చిత్రకారులు నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఎవరెవరివి ఏయేరకాల పెయింటింగ్స్ ప్రదర్శించేరు? నాటకంలో నటుల పెర్‌ఫార్మెన్స్ ఎలా ఉంది? సంగీతం పాడిన ఆయన ఏరాగంలో ఏ కీర్తన ఎవరి కృతి పాడారు? రచయితలు ఏవిషయాల మీద కొత్త కథలూ కవితలూ చెప్పేరు? - ఈ వివరాలేమీ లేవు నీ రిపోర్టులో - ఫొటోలు కూడా ముఖ్య అతిథులవే ఇచ్చినట్టున్నావు. ఇలాగైతే కల్చరల్ రిపోర్టింగ్ చేసి ఏమీ ప్రయోజనం లేదు." అన్నారాయన ఆవేశంగా.

"అయామ్ సారీ సార్. అవన్నీ రాస్తే పూర్తిగా ఒక పేజీ కావలసి వస్తుంది, మన సాంస్కృతిక ఉత్సవాల రిపోర్టుకి. ఇప్పటికీ అరపేజీ తినేశానని వాళ్లు గోల పెడుతున్నారు." అని చెప్పేను.

"ఈ లెక్కలో నువ్వు ఆ పత్రికకి మన కంపెనీ తరఫున సాంస్కృతిక విలేకరిగా ఉండడం అనవసరం, అపేయి." అన్నారాయన, ఎటోచూస్తూ.

నేను ఆపెయ్యకపోయినా ఆ పత్రికవాళ్లు ఆపేస్తారు. అది ఖాయం. ఎందుకంటే ఆ పత్రిక మేనేజర్‌గారు మా పాత ఎం.డి.గారికి తోడల్లుడు గాని ఈయనకి కాదు!

★